# ఫిట్టింగ్ రాంబాబు

నా పేరు రాంబాబు. కాని నన్ను అంతా 'ఫిట్టింగ్ రాంబాబు' అని నా వెనక నిక్‌నేమ్‌తో పిల్చుకోవడం గురించి నాకు తెలుసు. కాని నేను పట్టించుకోను ఎందుకంటే నిజంగా నేను ఫిట్టింగ్ రాంబాబునే.

నిజాయితీగా అయిదేళ్ళలో సంపాదించే డబ్బుని నేను, అడ్డదారిలో అయిదునెలల్లో సంపాదించుకోవడానికి దారికోసం వెతుకుతుంటాను. సన్నగా పొట్టిగా వుండే నన్ను చూసి చాలామంది భయపడతారు, వాళ్ళకేం టోపీ పెడతానోనని.

ఓ నవలని ఎవరయిన తెలుగులో సినిమా తీయాలనుకుంటున్నారని నాకు తెలిస్తే ఆ రచయిత దగ్గరికి వెంటనే వెళ్ళి కొంత అడ్వాన్స్ ఇచ్చి నా పేర రాయించుకుంటాను. దాన్ని తీయాలనుకున్న నిర్మాత దానిమీద వ్యామోహం కొద్దీ ఎక్కువ ఇచ్చుకుంటారు నాకు. ఇలాగే ఏ ఆఫీస్‌లో అయినా తమ కొత్త సినిమాలకు ఫలానా పేరు పెట్టాలనుకున్నారని తెలిస్తే (ఆఫీస్ బాయ్‌లకి నాకు వచ్చేలాభంలో కొంత ముట్టచెపుతాను కాబట్టి వాళ్ళ గోడలే నా చెవులు) దాన్ని నేను రిజిస్టర్ చేయించి తర్వాత లాభానికి వాళ్ళనుకున్న టైటిల్‌ని వాళ్ళకే అమ్ముతాను. ఎవరైనా ఓ భాష నుంచి ఇంకో భాషలోనికి సినిమా తీయాలని హక్కులు కొంటే నేను డబ్బింగ్ రైటింగ్ కొని వాళ్ళకి పోటీగా దిగుతానని బెదిరించి నాకెంత నష్టం అని వాళ్ళదగ్గర డబ్బు గుంజుతాను. ఏభై డెభ్భై లక్షలకు సినిమా తీసిన

వాళ్ళకు నాకు రెండో—మూడో లక్షలు కొట్టడంలో తప్పు లేదని నా ఉద్దేశం.

బేసిక్‌గా నా కేరెక్టర్ మీకు అర్థమైంది కాబట్టి మీరు నన్ను 'ఫిట్టింగ్ రాంబాబు' అంటే అనండి ఐ డోంట్ కేర్.

నా తెల్లమారుతి, దానికి పెట్రోల్, నా కుటుంబానికి అన్ని అవసరాలు తీర్చే ఆదాయం నాకు ముఖ్యం.

అందుకే నా కళ్ళు అటు, ఇటూ, సరాసరయిన అవకాశం కోసం వెదుకుతుంటాయి. అలాంటి అవకాశం ఆరోజు వచ్చింది.

*　　　*　　　*

ఓ ఫిల్మ్ ఫైనాన్షియర్ దగ్గరికి నేను తీయబోయే కొత్త సినిమాకి ఫైనాన్స్ గురించి మాట్లాడడానికి వెళ్ళాను. ఆయన ఇంట్లో ఆయనొక్కడే ఉన్నాడు. పూజ చేసుకుంటుండగా వెళ్ళాను. పది నిముషాలలో వస్తానని కూర్చోమని చెప్పి సంధ్యావందనం వార్చుకోసాగాడు.

కాలక్షేపానికి టేబిల్‌మీద ఉన్న ఓ మేగజైన్‌ని అందుకొని తిరగేయసాగాను. ఓ పేజీలో ప్రింట్ అయిన నోటుని చూడగానే ఆసక్తిగా దాన్ని చదివాను.

సెక్యూరిటీ ప్రెస్‌లో అచ్చు తప్పుపడిన నోట్లని మళ్ళీ పరిశీలించి నాశనం చేస్తారు. కాని అరుదుగా వారి దృష్టిలో పడకుండా కొన్ని నోట్లు చలామణిలోకి వస్తాయి. అలాంటి వాటి విలువ ఆ నోటుకన్నా కొన్ని వందలరెట్లు అధికంగా వుంటుంది. అలాంటివి హాబీగా సేకరించేవాళ్ళు ఎంత డబ్బయిన వెచ్చించి కొంటుంటారు.

నంబరు తప్పుపడ్డ నోట్ల విలువ అన్నిటికన్నా అధికం. ప్రతి నోటు మీద ఒకే నెంబరు రెండుచోట్ల వుంటాయి. రెంటి నెంబరు ఒకటే అయి వుండాలి. కాని ఒకోసారి ఒకేనోటు మీద రెండు వేరే వేరే నంబర్లు పడుతుంటాయి....

"వస్తారా ?" ఆయన మాట విని పుస్తకం తీసుకొని ఆయన వెంట ఆఫీసు గదిలోకి వెళ్ళాను.

ఆయన నాతో మాట్లాడేముందు రిసీవర్ అందుకుని ఓ నంబరుకి డయల్ చేసి చెప్పారు.

"నా దగ్గర అయిదు వందల రూపాయల నోట్లు రెండున్నాయి. ఒక దానిమీద నెంబర్లు తేడా. ఇంకోదాని మీద రిజర్వుబాంకు గవర్నర్ సంతకం లేదు. ఎంతిస్తారు ?"

ఆయన దేన్ని గురించి మాట్లాడుతున్నారో నాకర్థం అయింది.

'అబ్బే.... ఏభై వేలు మామూలు రేటు.... లక్షకి తగ్గను. ఆలోచించుకోండి. లేదా చిమన్‌లాల్ భయ్యాని కాంటాక్ట్ చేస్తాను" చెప్పారు.

ఆయన రిసీవర్ పెట్టేశాక అడిగాను.

"తప్పు ప్రింటయిన నోట్ల గురించా మీరు ఇప్పుడు మాట్లాడింది ?"

"అవును !"

ఆయన డ్రాయర్ తెరచి అందులోంచి ఓ ట్రాన్స్‌పరెంట్ ప్లాస్టిక్ కవర్లు తీసి చూపించారు. అందులో రెండు అయిదువందల రూపాయ నోట్లున్నాయి. వాటిని అందుకుని పరిశీలిస్తుంటే చెప్పారాయన.

"జాగ్రత్త. సరికొత్త నోట్లు. నలిగిపోతే ధర తగ్గుతుందని ఆ కవర్లో వుంచాను."

"వాటి ధర లక్షదాకా వుంటుందా ?" అడిగాను అనుమానంగా.

"ఈజీగా" చెప్పాడతను. మరుక్షణం టేబుల్‌మీద ఉన్న కవర్ తెరచి స్టీల్ కత్తిని అందుకుని సరిగ్గా అతని గొంతుకలో పొడిచాను. కసుక్కుమంటూ దాని చివర అవతలనుంచి బయటికి వచ్చింది. ఆయన నోట్లో నుంచి గరగర శబ్దం తప్ప మూలుగు రాలేదు. ఆశ్చర్యంగా నావంక చూస్తుండగానే ఆయన ప్రాణాలు పోయాయి. ముందర ఆ ప్లాస్టిక్ కవర్లను నాతో తెచ్చిన బ్రీఫ్‌కేస్‌లో ఉంచాను.

చేతిరుమాలుతో రిసీవర్ అందుకుని డయల్ నంబరు నొక్కాను ఇందాక ఆయన డయల్ చేసిన నంబరు మ్రోగింది. అవతలివైపు ఎత్తాక అడిగాను. "టెలిఫోన్ డిపార్ట్ మెంట్ మీ నెంబరు ఎంత ?"

చెప్పారు.

అడ్రస్ !

అది రాసుకొని ఫోన్ పెట్టేశాను.

తరువాత కత్తి పిడిని చేతిరుమాలుతో తుడిచాను. ఆ తరువాత నేను కూర్చొన్న కుర్చీ హ్యాండిల్స్ రెంటినీ, నేను చదివిన మ్యాగజైన్‌లోని కాగితాలను నావేలిముద్రలు దొరక్కుండా తుడిచాను. వచ్చినదారినే బయటికి నడిచాను.

పోలీసులకు నేనే హంతకుణ్ణి అని పట్టించే సాక్ష్యాధారాలు ఏవీ దొరక్కుండా జాగ్రత్తపడ్డాను. నేను ఆయనింటికి వెళ్ళానని, ఆయన్ని ఆఖరి సారిగా బతికుండగా చూసింది నేనేనని చెప్పడానికి ఆయన బ్రతికిలేడుగా !

మర్నాడు ఉదయం పేపరులో ఆయన హత్య గురించి రాశారు. హంతకుడి ఆచూకీ దొరకలేదని, ఏమి పోలేదు కాబట్టి హత్యకు కారణం పగయి ఉండవచ్చునని రాశారు.

వారందాకా రోజూ పేపరులో ఆయనకు సంబంధించిన వార్తకోసం చూడసాగాను. మళ్ళీ ఏ వార్త రాలేదు. వారం తరువాత ఆ నెంబర్ కి డయల్ చేసి చెప్పాను.

"నా పేరు రాంబాబు. మీరు తప్పు ముద్రణ పొందిన కరెన్సీనోట్లను సేకరిస్తుంటారని తెలిసింది. నిజమేనా ?"

"అవును ! మీదగ్గరేమయినా వున్నాయా ?"

"ఉన్నాయి........"

వాటి వివరాలు చెప్పాను.

అతను నా అడ్రస్ తెలుసుకోవడానికి అట్టే ఉత్సాహం చూపించ లేదు. బేరం వేలకు సెటిల్ అయింది.

మర్నాడు ఉదయం వచ్చి నోట్లు ఇచ్చి ఆ డబ్బా తీసుకెళ్ళమని ఫోన్ పెట్టేశాను.

మర్నాడు ఉదయం బ్రీఫ్‌కేస్ తెరచి చూస్తే అవి కనిపించలేదు.

"అయిదు వందల రూపాయల నోట్లు రెండు నా బ్రీఫ్ కేసులో ఉండాలి ?" నీవుగాని చూశావా? అడిగాను నా భార్యని.

"ఈ నెల పాలవాడికి, సూపర్ బజార్‌కి, ఖర్చుకి అవి తీయకపోతే ఎక్కడ్నుంచి తెచ్చాననుకుంటున్నావు ?" అడిగింది నా భార్య కోపంతో.

నా భార్యని కొట్టటానికి ఎత్తిన చేతిని అలాగే ఆపేశాను. బయట ఆగిన పోలీస్ వ్యాన్‌ని చూసి ఇన్స్‌పెక్టర్ నావంక చూసి అడిగాడు. మీరేనా "ఫిట్టింగ్ రాంబాబు ?"

"మా ఇంటి పేరు ఫిట్టింగ్‌కాదు" చెప్పాను.

"ఫిలిం ఫైనాన్సియర్‌ని హత్యచేసిన రోజు మీరు అతనింట్లో నుంచి ఒకరికి ఫోన్ చేసి అడ్రస్ ఎందుకు తీసుకున్నారు ? టెలిఫోన్ డిపార్ట్ మెంట్ నుంచి అని అబద్ధం ఎందుకు చెప్పారు ?" అడిగాడు.

"అది అబద్ధం" చెప్పాను వెంటనే.

"నిజం !"

ఆయన ఆఖరి ఫోన్‌కాల్ ఎవరికి చేశాడో తెలుసుకోవాలని రీ డయల్ బటన్ నొక్కి తెలుసుకున్నాము. ఇందాక అతను మీకు ఫోన్ చేసి చెప్పాడు మీ సంభాషణ గురించి.

"అతను అబద్ధం చెపుతున్నారు" చెప్పాడు కోపంగా.

"పొరపాటున అతని ఆన్సరింగ్ మెషిన్‌లో మీ సంభాషణ రికార్డ్ అయింది. ఆ క్యాసెట్ సాక్ష్యం. ఆ ఫైనాన్సియర్‌ని హత్య చేసినందుకు అరెస్ట్ చేస్తున్నాము చెప్పాడు ఇన్స్‌పెక్టర్.

ఓ కానిస్టేబుల్ నా చొక్కాకాలర్ పట్టుకొని ముందుకు తోశాడు.